సాక్షి
కృష్ణాజిల్లా
సోమవారం । 13 । మార్చి । 2023



ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి:రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సీతారామమూర్తి దంపతులు ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



కార్తికేయుని సన్నిధిలో భక్తుల రద్దీ

మోపిదేవి:వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. స్వామి దర్శనానికి ఉదయం నుంచే క్యూలైన్లు నిండిపోయాయి.

నేడు స్పందన

చిలకలపూడి(మచిలీపట్నం):ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహిస్తామని కలెక్టర్ పి. రంజిత్‌బాషా ఆదివారం తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.



న్యూస్‌రీల్

దుర్గమ్మ సన్నిధిలో జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు దంపతులు ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం జస్టిస్ దుర్గాప్రసాద్‌రావుకు వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

కుంభాభిషేకం పోస్టర్ల ఆవిష్కరణ



అవనిగడ్డ: కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో మే 12వ తేదీన కుంభాభిషేకం, లక్ష మందికి అన్నదానం చేపట్టనున్నట్టు నిర్వాహకులు అష్టాక్షరి జీయర్‌స్వామి తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మికత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. అష్టాక్షరి జీయర్‌స్వామి మాట్లాడుతూ దివిసీమ కేంద్రంగా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శబరిమల అయ్యప్ప సేవా సమాజం రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శబరిమల అయ్యప్ప సేవా సమాజం రాష్ట్ర నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా సంకాస్వామి (విజయవాడ), ప్రధాన కార్యదర్శిగా మేకల వెంకయ్య (నెల్లూరు), కోశాధికారిగా అవ్వారు బుల్లాబ్బాయ్ (విజయవాడ) నియమితులయ్యారు. విజయవాడ కేఎల్‌రావునగర్‌లోని బుల్లాబ్బాయ్ నివాసంలో ఆదివారం శబరిమల అయ్యప్ప సేవా సమాజం జాతీయ ప్రధాన కార్యదర్శి రాజన్ (ఈరోడ్), సంకా వాసుల అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తొలుత రానున్న ఏడాదిలో చేపట్టే అన్నదాన కార్యక్రమాలు, హరిహాసనం శతాబ్ద ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. సేవలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. నూతన కమిటీ రెండేళ్ల పాటు సేవలు అందిస్తుందన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడు బాజల్ గురుస్వామి, శరత్ బాబు గురుస్వామి, కోర్ కమిటీ సభ్యులు వక్కలగడ్డ రామకృష్ణ, కార్యదర్శి కిరణ్, మారుతీ, నారాయణమూర్తి, రమణ, కిరణ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు



వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా అవనిగడ్డలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



కానూరు సనత్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

- ఘనంగా వైఎస్సార్ సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవం
- జిల్లా వ్యాప్తంగా రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ పతాకం
- వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులు
- జననేత జగనన్న సంక్షేమ పాలనపై ఆనందోత్సాహాలు

కంకిపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. పార్టీ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెట్టిన వేడుకను వాడవాడలా ఉత్సాహంగా జరుపుకొన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి అడుగడుగునా ఘన నివాళులర్పిస్తూ, జననేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను స్వాగతిస్తూ పార్టీ శ్రేణులు కదం తొక్కారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ పతాకం రెపరెపలాడింది. ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాసటగా నిలవాలని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పిలుపునిచ్చారు.

- పెనమలూరు నియోజకవర్గంలోని కానూరు సనత్‌నగర్‌లో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హాజరయ్యారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. పెనమలూరు, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్‌లు మద్దాలి రామచంద్రరావు, వల్లభనేని వెంకటేశ్వరరావు, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు పాల్గొన్నారు.
- పామర్రు నియోజకవర్గ వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సం ఘనంగా నిర్వహించారు. పామర్రు, పెద పారుపూడి మండలాల్లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- అవనిగడ్డ నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సంబరంగా సాగింది. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. చల్లపల్లిలో స్థానిక పార్టీ శ్రేణులు ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
- గన్నవరం నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీలు అనగాని రవి, చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి కార్యకర్తలు సంబరాలు చేశారు.
- మచిలీపట్నం నియోజకవర్గంలో ఆవిర్భావ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పేర్ని నాని తనయుడు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. పార్టీ జెండా ఆవిష్కరించి శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.
- పెడన నియోజకవర్గంలో వాడవాడలా పార్టీ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. పట్టణంతో పాటు, మండలం, గూడూరు మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు రాజీవ్ పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ గరికపాటి చారుమతి, ఎంపీపీ రాజులపాటి వాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా ఇతర నేతలు పాల్గొన్నారు. గూడూరులో 30 మంది పేద మహిళలకు జోగి రాజీవ్ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ గౌరిపర్తి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- గుడివాడ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఏరియా ఆసుపత్రి చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సీనియర్ నేత మండల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



పామర్రులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పార్టీ రాష్ట్ర కార్యాలయంలో..

తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, రాష్ట్ర మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి, ప్రభుత్వ సలహాదారులు ఎస్ఎం జియాఉద్దీన్, పార్టీ నాయకులు నారమల్లి పద్మజ, పుణ్యశీల, బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఎం.శేషగిరిరావు, ఆరిమండ వరప్రసాదరెడ్డి, పండుగాయల రత్నాకర్, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, కావటి మనోహర్ నాయుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, కిరణ్‌రాజుతో పాటు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

22 నుంచి వసంత నవరాత్రోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల 22వ తేదీ నుంచి వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శోభకృత్ నామ సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పుష్పార్చన ప్రారంభమవుతుంది. తొలిరోజు అమ్మవారికి మల్లెలు, మరువం, 23న కనకాంబరాలు, ఎర్రగులాబీలు, 24న తెల్ల చామంతి ఇతర పుష్పాలు, 25న మందార పుష్పాలు, ఎర్రకలువ పూలు, 26న తెల్లజిల్లేడు, మారేడు, తులసీ, మరువం, దవళం, 27న కాగడా మల్లెలు, జాజులు, మరువం, 28న ఎర్రతామరలు, ఎర్ర గన్నేరు, సన్నజాజులు, 29న పసుపు చామంతి, సంపెంగలు, 30న కనకాంబరం, ఎర్ర గులాబీలతో అర్చన నిర్వహిస్తారు.

పంచాంగ శ్రవణం...

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో బుధవారం మధ్యాహ్నం పంచాంగ శ్రవణం జరుగుతుంది. రాజగోపురం ఎదుట కళావేదికపై ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాయంత్రం ఆరు గంటలకు గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామివార్లకు వెండి రథంపై నగరోత్సవం నిర్వహిస్తారు.

29 నుంచి శ్రీరామనవమి వేడుకలు..

క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. 29వ తేదీ ఘాట్‌రోడ్డులోని స్వామి వారి ఆలయంతో పాటు రావిచెట్టు వద్ద ఆంజనేయ స్వామి వారికి విశేష అభిషేకాలు, తమలపాకులతో అర్చన నిర్వహిస్తారు. 30వ తేదీ శ్రీరామనవమిని పురస్కరించుకుని కల్యాణోత్సవం వైభవంగా చేస్తారు. 31న పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి.

పోలీస్ భవనాలకు ప్రజాప్రతినిధుల చేయూత

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చొరవతో కూచిపూడి పోలీస్ స్టేషన్ నిర్మాణానికి అడుగులు
- భవనం నిర్మించేందుకు 27 సెంట్ల స్థలం ఇచ్చిన దాతలు
- మచిలీపట్నంలో పోలీస్ ఆస్పత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే పేర్ని సహకారం
- మినీ గుడివాడ టిడ్కో సముదాయాల వద్ద పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కొడాలి నాని కృషి
- భవన నిర్మాణానికి 20 సెంట్ల స్థలం కేటాయింపు



కూచిపూడిలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కైలే (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయవాడ: శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమించే పోలీసుల సంక్షేమానికి ప్రజాప్రతినిధులు విశేషంగా కృషి చేస్తున్నారు. పోలీసుస్టేషన్ల భవనాలు, ఆస్పత్రి నిర్మాణాలకు ఎమ్మెల్యేలు చేయూతనిస్తున్నారు. ఇందులో భాగంగా పామర్రు నియోజకవర్గంలోని కూచిపూడి పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి తొలి అడుగు పడింది. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని నియోజవర్గ అభివృద్ధి నిధులు, తన సొంత, స్నేహితులు, దాతల సహకారంతో రూ.50 లక్షలు సమకూర్చి స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ స్టేషన్ నిర్మాణానికి ఎస్పీ జాషువాతో కలిసి శంకుస్థాపన చేశారు. వాస్తు, పక్కా ప్లానింగ్‌తో నిర్మాణం మూడునెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన 27 సెంట్ల స్థలాన్ని దాతలు బలరామయ్య, గోపాలకృష్ణలు అందించారు. నిర్మాణం పూర్తయితే పోలీసు సిబ్బందితో పాటు, పామర్రు సర్కిల్ పరిధిలో 70 వేల మంది ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

మినీ గుడివాడ టిడ్కో గృహ సముదాయం వద్ద...

గుడివాడ సమీపంలోని మల్లాయపాలెం వద్ద 8,912 టిడ్కో గృహాలు నిర్మించారు. దాని పక్కనే 4,400 మంది లబ్ధిదారులతో జగనన్న కాలనీ నిర్మిస్తున్నారు. సుమారు 60 వేల మందికి పైగా ప్రజలు ఆ ప్రాంతంలో నివాసం ఉండబోతున్నారు. అంటే అక్కడ మినీ గుడివాడ పట్టణం ఏర్పడబోతోంది. ఇక్కడ నివసించే ప్రజలకు శాంతి భద్రతల విఘాతం కలగకుండా పర్యవేక్షించడంతోపాటు, వారికి సేవలు అందించేందుకు వీలుగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని సంకల్పించారు. ఇందులో భాగంగా ఆయన ప్రత్యేక చొరవ చూపి స్టేషన్ నిర్మాణానికి 20 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. అక్కడ స్టేషన్ నిర్మాణానికి సైతం నియోజకవర్గ అభివృద్ధి నిధులు, తనతోపాటు, మిత్రులు, దాతల సహకారంతో భవన నిర్మాణం చేపట్టే దిశగా కృషి చేస్తున్నారు. అతి త్వరలోనే పనులకు శంకుస్థాపన చేసేందుకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలీసు శాఖ తరఫున ధన్యవాదాలు

జిల్లాలో పోలీస్ స్టేషన్ల నిర్మాణం, మచిలీపట్నంలో పోలీస్‌లకు సేవలు అందించేందుకు వీలుగా ఆస్పతి భవన నిర్మాణానికి ఎమ్మెల్యేలు తమ వంతు సహకారం అందించడం శుభ పరిణామం. శాంతి భద్రతల పరిక్షణకుతోడు, ప్రజల రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎమ్మెల్యేలే స్వయంగా ముందుకు వచ్చి తమ ప్రాంత ప్రజలకు సేవలు అందించేలా పోలీస్ స్టేషన్‌ల నిర్మాణం చేస్తున్నారు. వారికి పోలీస్ శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను.

– జాషువా, కృష్ణా జిల్లా ఎస్పీ

పోలీస్ ఆస్పత్రి భవనానికి....

మచిలీపట్నం జిల్లా కేంద్రంలో పోలీసులకు వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రి భవనం లేదు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ జాషువా మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన డాక్టర్, సిబ్బంది నియామకంతో పాటు , వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఆస్పత్రి భవనం నిర్మించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఇందుకు అనుగుణంగా వెంటనే దానికి సంబంధించిన ప్లాన్ సిద్ధం చేసి, మూడు నెలల్లో నిర్మించేలా కృషి చేస్తానని చెప్పారు. దీంతోపాటు మచిలీపట్నంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోయేలా 300 సాఫ్టర్‌లు ఇవ్వడంతోపాటు, పట్టణంలో ప్రత్యేకంగా సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు.

నులి పురుగులను నులిమేద్దాం



ఆల్బెండజోల్ మాత్రలు ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తున్న దృశ్యం

- రేపు జిల్లా వ్యాప్తంగా మందుల పంపిణీ
- 4.78 లక్షలు ఆల్బెండజోల్ మాత్రలు సిద్ధం
- 4.50 లక్షల మంది పిల్లలకు వేయాలని లక్ష్యం
- ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ మాత్రలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పిల్లల్లో నులి పురుగులను నివారించేందుకు ఈ నెల 14న జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వనున్నారు. ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ల వయస్సున్న వారి వరకు ఈ మాత్రలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఆల్బెండజోల్ మాత్రలు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చేరుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 4.50 లక్షల మందికి మాత్రలు వేయాలని లక్ష్యం కాగా 4.78 లక్షల మాత్రలను అందుబాటులో ఉంచారు. జాతీయ నులిపురుగుల నివారణలో భాగంగా ఏకకాలంలో పిల్లలందరికీ మాత్రలు ఇచ్చేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు.

అన్నీ సిద్ధం చేశాం



ఏడాది నుంచి 19 ఏళ్ల చిన్నారులకు మాత్రలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే మందులను అంగన్‌వాడీలకు, ఏఎన్ఎంలకు చేరవేశాం. ఈ నెల 14న జిల్లా అంతటా మాత్రలు పిల్లలకు ఇస్తాం. ఈ మాత్రలు వేసుకోవడం ఎంతో ప్రయోజనం. నులిపురుగులు నశించి పిల్లలకు యాక్టివ్‌గా ఉంటారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్ఓ, ఎన్టీఆర్‌జిల్లా

నులి పురుగులతో తలెత్తే ఇబ్బందులు ఇవే..

- నులి పురుగులు ఉన్న చిన్నారుల్లో ఎదుగుదల లోపం తలెత్తుతుంది.
- పోషకాహారం లోపం ఉన్న చిన్నారుల్లా బక్కగా ఉంటారు.
- నులి పురుగులు రాత్రి నిద్రలేకుండా చేస్తాయి. దీంతో నీరసపడిపోతుంటారు.
- ఏకాగ్రత లోపించడంతో చదువుపై దృష్టి పెట్టలేకపోతుంటారు.
- మూత్ర విసర్జనకు తరచూ వెళ్తుంటారు.
- ఇంట్లో ఒకరికి ఉంటే, మిగిలిన వారికి వచ్చే అవకాశం ఉంది.
- కొందరు చిన్నారుల్లో కడుపునొప్పి కూడా వస్తుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

- ఆల్బెండజోల్ మాత్రలు వేసుకున్న చిన్నారులు కొందరిలో వికారం, వాంతులు, విరోచనాలు, నీరసం వంటి లక్షణాలు కనిపించవచ్చు. అవి తాత్కాలికమే. వాటికి చికిత్స చేయవచ్చు.
- ఇలాంటి లక్షణాలు కనిపించిన పిల్లలను నీడలో పడుకోబెట్టి మంచినీరు ఇవ్వాలి.
- ఆల్బెండజోల్ మాత్రను పూర్తిగా నమిలి మింగాలి. నమలకుండా వేసుకుంటే గొంతులో ఇరుక్కునే అవకాశం ఉంది.
- అనారోగ్యంతో ఉన్నా, ఇతర మందులు వాడుతున్న పిల్లలు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోరాదు.
- పిల్లలకు మాత్రను బలవంతంగా తినిపించరాదు.

ఆల్బెండజోల్ మాత్రలు వాడకం ఇలా...

పిల్లలకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చు.

- ఏడాది నుంచి రెండేళ్ల వయస్సు చిన్నారులకు 200 ఎంజీ మాత్రలు (400 ఎంజీలో సగం) నీళ్లలో కలిపి తాగించాలి.
- మూడేళ్ల చిన్నారులకు 400 ఎంజీ మాత్రను నీటిలో కలిపి తాగించాలి.
- నాలుగేళ్ల నుంచి 19 ఏళ్ల వారు 400 ఎంజీ మాత్రను నమిలి మింగాల్సి ఉంటుంది.

జిల్లాలో మందుల పంపిణీ ఇలా..

- ఏడాది నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు: 93,352
- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు: 956
- వాటిలోని పిల్లలు: 1,22,686
- జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు: 551
- వాటిలోని పిల్లలు: 1,90,349
- జిల్లాలో కళాశాలలు: 168
- వాటిలో 19 ఏళ్లలోపు వారు: 42,694

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో కిటకిటలాడుతున్న భక్తులు



హాల్ టికెట్లతో అమ్మవారిని దర్శించుకుంటున్న విద్యార్థులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు రావాలని విద్యార్థులు, అమ్మవారి ఆశీస్సుల కోసం నవ దంపతులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో సర్వ దర్శనానికి రెండు గంటలకు పైగానే సమయం పట్టింది. ఉదయం ఆరు గంటల నుంచే భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండ పైకి చేరుకున్న భక్తులు సర్వదర్శనం, రూ.100, రూ.300, రూ.500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థాన ఈవో భ్రమరాంబ, చైర్మన్ కర్నాటి రాంబాబు పలుమార్లు ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లను పర్యవేక్షించారు. టికెట్లు లేకుండా ఎవరినీ వీఐపీ దర్శనానికి అనుమతించవద్దని సిబ్బందిని హెచ్చరించారు. అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం 2.30 గంటల వరకు రద్దీ కొనసాగింది. ఇక అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. రాజగోపురం కళావేదికపై లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ సూర్యోపాసన సేవ నిర్వహించారు.

హాల్ టికెట్లతో ఆలయానికి..

వచ్చే బుధవారం నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానుండటంతో అమ్మవారి పాదాల వద్ద హాల్ టికెట్లు ఉంచి ఆశీస్సులు అందుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు.

క్లుప్తంగా

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ చైర్‌పర్సన్‌గా సుధారాణి



జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(ఏపీపీఎస్ఏ) ఉమ్మడి కృష్ణా జిల్లా చైర్‌పర్సన్‌గా జగ్గయ్యపేట విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత తన్నీరు సుధారాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 11వ తేదీన నూజివీడు త్రివిధ స్కూల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లాల వారీగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా మహిళా చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తన్నీరు సుధారాణికి ఎన్నికల అధికారి, త్రిసభ్య కమిటీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఉమ్మడి జిల్లా చైర్మన్ గొల్లపూడి మోహనరావు, సెక్రటరీ కుమార్, గౌరవ సలహాదారు ప్రవీణ్, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు భార్గవరాజు, పేట డివిజన్ ప్రెసిడెంట్ కొమరగిరి భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీల గురించి మాట్లాడే అర్హత పవన్‌కు లేదు'

సాక్షి, అమరావతి : బీసీల గురించి మాట్లాడే అర్హత జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు లేదని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ అన్నారు. బీసీ మంత్రులపై దాడి చేయించిన చరిత్ర వారిదని.. చంద్రబాబు మేలు కోసం ఇప్పుడు బీసీ మంత్రం జపిస్తే నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీల పట్ల, బీసీ కులాల పట్ల కనీస అవగాహన లేనటువంటి వ్యక్తి పవన్ అని మండిపడ్డారు. బీసీలను మభ్యపెట్టి చంద్రబాబుకు అనుకూలంగా పనిచేయాలనే తపన తప్ప, బీసీల ప్రయోజనాలను పట్టించుకునే చిత్తశుద్ధి పవన్‌కు లేదన్నారు. రాష్ట్రంలో బీసీలకు సీఎం జగన్ చేసిన సామాజిక న్యాయం మరెవరు చేయలేదని స్పష్టం చేశారు. సర్పంచ్ స్థాయి నుంచి రాజ్యసభ వరకు బీసీలకు రాజ్యాధికారంలో అగ్రపీఠం వేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు బీసీల తోకలు కత్తిరిస్తానని అన్నప్పుడు, బీసీలపై తప్పుడు కేసులు పెట్టించినప్పుడు పవన్ ఏమయ్యారని ప్రశ్నించారు.

టికెట్లు మారిపోతున్నాయ్!

- దుర్గగుడిలో రూ.500 టికెట్లకు బదులు రూ. 100 టికెట్లు
- మహా మండపం కౌంటర్‌లో ఘటన
- ఈవోకు ఫిర్యాదు చేసిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తుల నుంచి రూ.500 టికెట్లకు డబ్బులు తీసుకుని వాటికి బదులుగా రూ. 100 టికెట్లు ఇచ్చిన ఘటన ఆదివారం మహా మండపం టికెట్ల కౌంటర్‌లో చోటు చేసుకుంది. ఈ వ్యవహారాన్ని భక్తులు ఈవో భ్రమరాంబ దృష్టికి తీసుకువెళ్లడంతో సదరు కౌంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాకినాడలోని జేఎన్‌టీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. రద్దీ అధికంగా ఉండటంతో మహా మండపం కౌంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న కె.రమేష్‌కు రూ. 1500 ఇచ్చి మూడు రూ. 500 టికెట్లు ఇవ్వాలని కోరారు. రూ. 500 టికెట్లకు బదులుగా రూ. 100 టికెట్లు మూడు, ఆరు లడ్డూలను ఇచ్చి పంపేశాడు. రూ. 500 టికెట్లను గుర్తించేందుకు రెడ్‌కలర్ పేపర్‌పై ప్రింటింగ్ ఇస్తారు. రూ. 100 టికెట్లను అదే పేపర్‌పై ప్రింటింగ్ ఇవ్వడంతో వాటిని తీసుకుని నేరుగా స్కానింగ్ పాయింట్ వద్దకు వచ్చిన భక్తులను ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. రూ. 100 టికెట్లతో రూ. 500 టికెట్లు క్యూలోకి అనుమతించమని చెప్పడంతో వారు అవాక్కయ్యి, వెంటనే విషయాన్ని అక్కడే ఉన్న ఈవో భ్రమరాంబ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వెంటనే కౌంటర్లను పర్యవేక్షించే నగేష్‌ను రిపోర్టు ఇవ్వాలని సూచించారు. విచారణ చేసి సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని ఈవో పేర్కొన్నారు.



కౌంటర్‌లో జారీ చేసిన టికెట్లు

భక్తులను ఇబ్బంది పెట్టొద్దు

కేశఖండనశాల సిబ్బందికి దుర్గగుడి చైర్మన్ హెచ్చరిక

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చే భక్తులను ఇబ్బందులకు గురి చేసినా, అధిక వసూళ్లకు పాల్పడినా ఉపేక్షించేది లేదని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు కేశఖండనశాలలో సిబ్బందిని హెచ్చరించారు. దుర్గా ఘాట్ ఎదురుగా ఉన్న కేశఖండనశాలను ఆదివారం చైర్మన్ కర్నాటి రాంబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు రోజుల కిందట ఓ భక్తుడి నుంచి రూ. 1500 వసూళ్లకు పాల్పడిన నాయీబ్రాహ్మణుడి గురించి ఆరా తీశారు. భక్తుల నుంచి అధిక వసూళ్లకు పాల్పడుతూ ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చెడ్డపేరు తీసుకురావద్దని హెచ్చరించారు. భక్తులు తలనీలాలు సమర్పించే ప్రతి ఫ్లోర్‌లోనూ ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉండాలని, ఆ పుస్తకాన్ని వారం వారం పరిశీలిస్తానని పేర్కొన్నారు. భక్తులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వారిపై తప్పక చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కేశఖండనశాలలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులతో చైర్మన్ మాట్లాడారు. అనంతరం ఘాట్‌రోడ్డుపై దేవస్థానం బస్సులను తనిఖీ చేశారు.



కేశఖండనశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

ప్రత్యక్షమైన కార్తికేయుడు!



మోపిదేవి(అవనిగడ్డ): కృష్ణా జిల్లా మోపిదేవిలోని ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి నాగుపాము సంచరించింది. కార్తికేయుడే తమకు దర్శనమిచ్చాడని భక్తులు తన్మయత్వం చెందారు. పంచమి, ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఆలయ ప్రాంగణంలో నాగమల్లి వృక్షం వద్ద నుంచి నాగుపాము బయటకు వచ్చింది. అక్కడి నుంచి భక్తులు దీపారాధన చేసే ప్రాంతం వద్దకు నాగుపాము చేరుకుంది. సుబ్రహ్మణ్యస్వామి తమకు ప్రత్యక్షమయ్యాడంటూ పలువురు భక్తులు వీడియోలు తీశారు. అనంతరం నాగుపాము అంతర్ధానం అయ్యింది. రెండు, మూడు సంవత్సరాలకు ఓ మారు స్వామివారు ఇలా ప్రత్యక్షమవుతారని ఆలయ అధికారులు తెలిపారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మహిళా ఉత్సవ్–2023 ముగింపు సభలో వక్తలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలు వృత్తి విద్యా కోర్సులను నేర్చుకొని, ఆర్థికంగా బలోపేతం కావాలని ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ డెప్యూటీ సీఈవో వి.రాముడు చెప్పారు. స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా ఉత్సవ్–2023 ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి రాముడు అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పారిశ్రామికవేత్త ఎ.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఇలాంటి మహిళా ఉత్సవ్‌లు దోహదం చేస్తాయన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్న మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ మాట్లాడుతూ ప్రతి నెలా వృత్తి విద్యాకోర్సుల్లో తమ సంస్థ శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి ఉన్న రావిచెట్టు సెంటర్‌లోని తమ కార్యాలయంలో నేరుగా సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.



మాట్లాడుతున్న రాముడు

మళ్లీ మళ్లీ ఇది రానిరోజు



1968-69లో పదో తరగతి చదివిన విద్యార్థులు

పెనమలూరు: నాడు వారంతా నూనూగు మీసాల నూతన యవ్వనంలో ఉన్న అబ్బాయిలు, రెండు జళ్ల సీతలు, పట్టు పావడాలు, గజ్జెల సవ్వడులు చేసిన అమ్మాయిలు. మరిప్పుడో తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు. ఏడు పదులు సమీపిస్తున్న ఈ వయసులో 54 ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన వారంతా తాము చదివిన పాఠశాలలో కలుసుకోవడం ఓ అపూర్వ ఘట్టం. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ సందడిగా జరిగింది. వివిధ దేశాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకుని అలనాటి స్నేహానుభూతులను పంచుకున్నారు. పాఠశాలలో 54 ఏళ్ల తర్వాత ఆదివారం 1968–69 బ్యాచ్ విద్యార్థులు కలుసుకున్నారు. బాల్యంలో మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. దివంగత గురువులకు నివాళులర్పించారు. భవిష్యత్తుకు బాటవేసిన పాఠశాలకు తమ వంతు సహకారం అందిస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కిలారు బ్రహ్మాజీ, కోలా మల్లికార్జునరావు, అర్వపల్లి క్రాంతికుమార్, తాతనేని కోటేశ్వరరావు, డాక్టర్ గూడవల్లి యుగంధర్, టీఎస్ఆర్‌కే ప్రసాద్, కిలారు శేషకుమారి, అమ్మాజీ, తోటకూర ధనలక్ష్మి, పోలవరపు లక్ష్మి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

కోపా సేవలు అభినందనీయం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కులమతాలకు అతీతంగా ప్రతిభావంతులను గుర్తించి 25 ఏళ్లుగా స్కాలర్‌షిప్‌లను అందజేయటం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(కోపా) ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఢిల్లీరావు మాట్లాడుతూ విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని నిరుపేద, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఉపకార వేతనాలు అందించటం హర్షణీయమన్నారు. శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు తోట శరత్‌చంద్ర మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమంలో తాను కూడా భాగస్వామిని అయినందుకు ఆనందంగా ఉందన్నారు. కోపా అధ్యక్ష, కార్యదర్శులు కొప్పరాతి వెంకట రమణరావు, రామాయణం నాగసత్యం మాట్లాడుతూ 25 ఏళ్లుగా వేలాది మంది నిరుపేద, పేద విద్యార్థులకు రూ.2కోట్లకు పైగా ఉపకార వేతనాలు పంపిణీ చేశామన్నారు. అనంతరం 160 మంది విద్యార్థులకు రూ.15లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోపా వ్యవస్థాపకుడు డాక్టర్ బల్లెం నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కుటుంబంలోని ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చెప్పారు. ఆదివారం సిద్ధార్థ ఆడిటోరియంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఉపకార వేతనాల పంపిణీ చేశారు. ఢిల్లీరావు అతిథిగా హాజరై విద్యార్థులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు వ్యాపారం చేయడమే కాకుండా ఈ విధంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి మహిళల చదువు ఎంతో అవసరమన్నారు. మహిళల చదువును ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని చెప్పారు. సబ్ కలెక్టర్ అతిథి సింగ్ మాట్లాడుతూ జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోడానికి షార్ట్ కట్స్ అంటూ ఏమీ ఉండవని, కష్టపడాలని చెప్పారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సోర్స్ జోనల్‌హెడ్ షినోజ్ మాట్లాడుతూ ఈ ఏడాది 375 మందికి రూ.33.34 లక్షలను అందజేశామన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, డిస్ట్రిక్ట్ వొకేషనల్ ఆఫీసర్స్ ఎస్ఎస్ఎన్.రెడ్డి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గ్యాస్ పైపులైన్ లీక్.. ఎగిసిపడిన మంటలు



గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో గ్యాస్ పైపులైన్ లీకై మంటలు ఎగిసిపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కాలనీలోని శ్రీఆంజనేయస్వామి గుడి సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న మెయిల్ సీఎన్‌జీ గ్యాస్ పైపులైన్ వద్ద సాయంత్రం ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. కొద్దిసేపటికే మంటల తీవ్రత పెరగడంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ, మెయిల్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. గ్యాస్ పైపులైన్ వాల్వ్‌లను కట్టేసిన తర్వాత అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. పైపులైన్‌కు సమీపంలో వాటర్ వర్క్స్ కోసం తవ్విన గుంతలో పడేసిన చెత్తకు నిప్పు పెట్టడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లుగా అగ్నిమాపక శాఖ గుర్తించింది. మెయిల్ సిబ్బంది గ్యాస్ సరఫరా పునరుద్ధరణకు పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిమెంట్ కలర్ చొక్కా, మాసిన గెడ్డంతో సుమారు 60 ఏళ్లు ఉన్న వ్యక్తిని రామవరప్పాడు రింగ్‌లో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతునికి సంబంధించిన ఎటువంటి వివరాలు లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు పటమట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

గుడ్లవల్లేరు(గుడివాడ): కూరాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ వి.ఏసేబు చెప్పిన వివరాల మేరకు ఆదివారం వేమవరం నుంచి మండవల్లి మండలం పుట్లచెరువులో జరిగే పెళ్లికి ఆటోలో బంధువులు బయలుదేరారు. కూరాడ వద్దకు వచ్చేసరికి రోడ్డులో గొయ్యిని తప్పించబోయి అకస్మాత్తుగా బ్రేక్ వేయటంతో ఆటో తిరగబడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పామిడి మహేశ్వరరావు(62)కు తలకు తీవ్రగాయమై రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన బంధువులు చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

క్వారీ గుంతలో పడి బాలుడు మృతి

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన బాలుడు క్వారీ గుంతలో పడి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. కాచవరం అయ్యిందొర కాలనీకి చెందిన గుంజి మోహన్, బుజ్జి కుమారుడు గుంజి విజయ్ (10) ఇంటి సమీపంలో ఉన్న క్వారీలో బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడ్డాడు. కుమారుడు ఎంతసేపటికీ ఇంటికి రానందున తండ్రి చుట్టు పక్కల వెతికాడు. అయితే క్వారీ గుంత పక్కన బాలుడి నిక్కరు కనిపించింది. కానీ బాలుడు కనపడలేదు. అనుమానంతో స్థానికులు నీటి గుంతలో గాలింపు చర్యలు చేపట్టగా బాలుడి మృతదేహం లభించింది. ఒక్కగానొక్క కొడుకు అసువులు బాసటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలుడు స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తైక్వాండో రాష్ట్ర పోటీల్లో జిల్లాకు 14 పతకాలు

విజయవాడ స్పోర్ట్స్: ఐదో రాష్ట్ర స్థాయి తైక్వాండో అండర్–11, అండర్–14 చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులు 14 పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ నెల 10 నుంచి 12 తేదీ వరకు విశాఖపట్నంలోని యలమంచిలి వైఎస్సార్ స్టేడియంలో ఈ పోటీలు జరిగాయి. ఫైట్, పూమ్‌సే, గ్రూప్, వ్యక్తిగత, ఫెయిర్ విభాగాల్లో క్రీడాకారులు తలపడ్డారు. యు.శ్యామ్‌కుమార్, కె.దత్తశ్రీవత్స, కె.చంద్రకార్తీక్, కె.తేజశ్రీలు గోల్డ్ మెడల్స్ సాధించడంతో పాటు జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. ఎ.వంశీ, టి.అహేలీ, టి.సామీ రెండేసీ బ్రాంజ్ మెడల్స్ (ఫైట్, పూమ్‌సే విభాగాల్లో) సాధించగా, పి.జానకిరామ్, ఎం.దేవహర్ష, బి.ఉషశ్రీ, జి.యోగశ్రీమహాలక్ష్మి బ్రాంజ్ మెడల్స్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను కృష్ణా జిల్లా తైక్వాడో అసోసియేషన్ కార్యదర్శి ఎం.అంకమరావు, శాప్ కోచ్ పి.గౌరీశంకర్ అభినందించారు.



తైక్వాండో రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

కృత్రిమ అవయవాల కోసం కొలతలు

మచిలీపట్నంటౌన్: దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ కోసం కొలతలు సేకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కృష్ణాజిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండ్రస్టీస్, బృందావనపుర కమిషన్ అండ్ హోల్‌సేల్ మర్చంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నగరంలోని బృందావనపుర కల్యాణ మండపంలో ప్రమాదవశాత్తూ, మధుమేహ వ్యాధి కారణంగా అవయవాలు కోల్పోయిన దివ్యాంగులు దాదాపు 120 మంది నుంచి ఈ శిబిరంలో కొలతలు తీసుకున్నారు. చేతన ఫౌండేషన్, ఖమ్మం రోటరీ క్లబ్‌ల సౌజన్యంతో జైపూర్ కృత్రిమ అవయవాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంబర్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



దివ్యాంగుల కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

గంజాయి విక్రేతలు అరెస్ట్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): తుమ్మలపల్లి కళాక్షేత్రం పక్కన కాలువ ఒడ్డున ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను గవర్నర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో చిట్టినగర్‌కు చెందిన అనసూరి దుర్గ సాయి, షేక్ అబ్దుల్ జమీర్, షేక్ అక్బర్ వలీ ఉన్నారు. వారి వద్ద నుంచి 750 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. ఆదివారం గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ మాట్లాడుతూ తుమ్మలపల్లి పక్కన కాలువ గట్టుపై ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఎస్ఐ ఫణీంద్ర సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని గంజాయి సీజ్ చేసినట్లు తెలిపారు. అనసూరి దుర్గసాయికి గంజాయి తాగే అలవాటు ఉందని, ఓ ఆటో డ్రైవర్ వద్ద కొనుగోలు చేసి షేక్ అబ్దుల్ జమీర్, షేక్ అక్బర్ వలీలకు అమ్మేవాడన్నారు. వీరి ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు ఫణీంద్ర, విశ్వనాథ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సురేష్

రెండు కేజీల గంజాయి పట్టివేత..

ఆటోనగర్(విజయవాడతూర్పు): అరకు నుంచి విజయవాడకు బస్సులో తీసుకువచ్చిన రెండు కేజీల గంజాయిని పటమట పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సనత్‌నగర్‌కు చెందిన మణికంఠ, షేక్ అబ్దుల్ రెహమాన్, రేవెళ్ల గణేష్, భవాని శంకర్‌లు కలిసి అరకు నుంచి విజయవాడకు గంజాయి తీసుకు వచ్చి అమ్మకాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం ఆటోనగర్‌లోని డంపింగ్ యార్డు వద్ద గంజాయిని వీరందరూ పంచుకుంటుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నారు. వీరిలో మణికంఠ అనే వ్యక్తిపై పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో నాలుగు దొంగతనం కేసులు ఉన్నట్టు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.